కురవి వీరభద్ర స్వామిని దర్శించుకున్న

# ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు

జాతర నిర్వహణపై

ఎమ్మెల్సీ ఆగ్రహం

గాలికొదిలేసి చోద్యం

చూస్తున్నారంటూ

తీవ్ర విమర్శలు



2 లో

సూర్య దినపత్రిక

# సూర్య

www.suryaa.com



ఉమ్మడి వరంగల్

హన్మకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు

గురువారం | 27 | ఫిబ్రవరి | 2025 | పేజీలు : 18

# పాహిమాం...పరమేశ్వరా





- ముక్కంటికి .... మొక్కులు... భక్తి శ్రద్ధలతో శివ పూజలు,
- ఉదయం నుంచే ఆలయాల్లో బారులు తీరిన భక్తులు
- పలు ఆలయాల్లో సామూహిక రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు
- కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

సూర్య బ్యూరో ఉమ్మడి వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ సూర్య, శంకర... పాహిమాం పాహిమాం... అంటూ శివ నామ స్మరణతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శైవ క్షేత్రాలు మారుమోగాయి. మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా



మిగతా 2లో..



# సర్వం సిద్ధం

- నేడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక
- ఉమ్మడి జిల్లాలో పూర్తయిన ఏర్పాట్లు
- స్వేచ్ఛగా ఓటు వేసేలా పకడ్బందీ చర్యలు
- తీర్పు ఇవ్వనున్న ఉపాధ్యాయులు
- ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకు 4 గంటల వరకు

సూర్య బ్యూరో ఉమ్మడి వరంగల్, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్: నల్గొండ , వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉపా ధ్యాయులు తీర్పు ఇచ్చే సమయం ఆసన్న మైంది. ఉమ్మడి జిల్లాలో గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జర గనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం అధ్వ ర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశా రు. జిల్లాల వారీగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద బుధవారం విధులు కేటాయించిన ఎన్నికల అధికారులకు, సిబ్బంది కి సామాగ్రి పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని



మిగతా 2లో..

# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

వంగర కైలాస కళ్యాణి క్షేత్రాన్ని దర్శించుకున్న మంత్రి

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 26(మేజర్ న్యూస్ సూర్య): వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్య లు చేపట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలోని కైలాస కళ్యాణి క్షేత్రాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ


మిగతా 2లో..



# బతుకుదెరువు బుగ్గి...

చార్జింగ్ పెట్టిన ఎలక్ట్రిక్ ఆటోకు మంటలు

రూ.5లక్షల నష్టం..ఆదుకోవాలని ఆటో డ్రైవర్ విన్నపం



4 లో

# సర్వం సిద్ధం





మొదటి పేజీ తరువాయి..


పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామాగ్రితో సహా బుధవారం సాయంత్రానికే చేరుకున్నారు

సర్వం సిద్ధం...

ఉమ్మడి జిల్లా లో ఏర్పాట్ల ను అధికారులు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కు అవసరమైన సౌకర్యాలు ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాలో 24, 905 ఓట్లు ఉండగా ఉమ్మడి వరంగల్ లోని ఆరు జిల్లాల్లో 6, 509 మంది పురుషులు, 4,288 మంది మహిళా ఓటర్ల తో కలిపి 10,797 మంది ఓటర్లు ఉన్నారు. ఆరు జిల్లాలో 72 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ఎన్నికలో 19 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అదేవిధంగా ఎన్నికల సంఘం గుర్తించిన 14 రకాల గుర్తిం పు కార్డులలో ఏదైనా ఒకదానిని ఓటురు ఓటు వేయడానికి తమ వెంట తప్పని సరిగా తీసుక రావాలని ఎన్నికల అధికారులు సూచించారు. గుర్తింపు కార్డులలోని చివరి 4 అంకెలను సంబంధిత ఫార్మ్‌లలోఅధికారులు నమోదు చేయనున్నారు. ఓటరు పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించగానే ఓటరు వివరాలను సరి పోల్చి ఎడమ చేతి చూపుడు వేలుకు సిరా ను రాస్తారు. దివ్యాంగ ఓటర్లకు సంబంధించి 18 సంవత్సరాలు నిండిన వారిని సహాయకులుగా ఓటు వేయడానికి అనుమతించనున్నారు. వీరికి సాధారణానికి భిన్నంగా కుడి చేతి చూపుడు వేలుకి సిరాను రాయనున్నారు. వీరి నుంచి సంబంధిత ధృవీకరణ ను తీసుకోనున్నారు. ఎన్నిక ప్రారంభం కాగానే ప్రతి రెండు గంటలకు పోలింగ్ వివరాలను ప్రకటించేలా ఎన్నికల అధికారులు, సిబ్బందిని కలెక్టర్లు సంసిద్ధం చేశారు.







## కురవి వీరభద్ర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు

కురవి ఫిబ్రవరి 26,మేజర్ న్యూస్ (సూర్య): మహాశివరాత్రి సందర్భంగా ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు కురవి వీరభద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించు కురవి మహా జాతర నిర్వాహణపై ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కురవి జాతరకు వచ్చిన భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికైనా అప్రమత్తం కాకుంటే, రాత్రి జరిగే కళ్యాణోత్సవం మరింత రసాభాసగా మారే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తాను అనేక సంవత్సరాల నుండి జాతరాకు వస్తున్నానని, భక్తుల ఇంత అసౌకర్యానికి గురవడం, విఐపిల దర్శనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడాన్ని మాత్రం ఇప్పుడే చూస్తున్నానని ఆయన అన్నారు. జాతరను గాలికి వదిలి చోద్యం చూస్తున్నారని తీవ్రవిమర్శలు చేశారు.విషయాన్ని, ప్రభుత్వం దృష్టికి, సంబందిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.



# పాహిమాం...పరమేశ్వరా

మొదటి పేజీ తరువాయి..

ముక్కంటి దర్శనార్థం భక్తులు బుధవారం వేకువజాము నుంచే ఆల యాలకు తరలి వచ్చారు. భోళా శంకరున్ని బిల్వ దలాలతో ఆర్పించి , ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, మహా గణపతి పూజ, మహా హారతి తో పాటు శివ పార్వతుల కల్యాణ మహోత్సవం వంటి కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శివనామ స్మరణతో ఉమ్మడి జిల్లా మార్మోగింది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ఉమ్మడి జిల్లాలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. భక్తల రాకతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి.





# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

మొదటి పేజీ తరువాయి..

బోర్లు మరమ్మతులు నిర్వహించి గ్రామాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ప్రత్యేక అధికారులు కోరారు. వేసవికాలంలో గ్రౌండ్ వాటర్ పడిపోయినప్పుడు కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఉంటాయని, వాటిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం గ్రామాల్లో ప్రత్యక్షంగా సందర్శించి సమస్యలు తెలుసుకుంటానన్నారు. స్థానిక నాయకులు గ్రామాల్లో తాగు, సాగు నీటికి ఇబ్బందులు ఉన్నా జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, పాడి పంటలతో సంతోషంగా ఉండాలని ఆ మహా శివున్ని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సోదరుడు మనోహర్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్ది వెంకటనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టెంపెల్లి ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజేందర్ ను పరామర్శించిన మాజీ స్పీకర్ సిరికొండ



గీసుగొండ ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ (సూర్య)వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గం గీసుగొండ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు పసుల రాజేందర్ తల్లి శశిరేఖ ఇటీవల మృతిచెందారు.ఈ సందర్భంగా రాజేందర్ కుటుంబాన్ని తెలంగాణ తొలి మాజీ స్పీకర్ మధుసూదనాచారి పరామర్శించి,శశిరేఖ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ నరసింహ స్వామి,కోట ప్రమోద్,బండారి నరేందర్,మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహా కుంభమేళా పవిత్ర జలం వితరణ



గీసుగొండ ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ (సూర్య)ప్రయాగ్ రాజ్ వేదికగా జరుగుతోన్న మహా కుంభమేళా మహా శివరాత్రి పండుగతో ముగియనుంది. 144 ఏళ్లకు ఒక్క సారి వచ్చే మహా కుంభమేళాకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించాలని చాలామంది కోరుకుంటారు.కానీ అందరికీ వీలు కాదు.అలాంటి వారి కోసమే గీసుగొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన సునీల్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మహా కుంభమేళాలోని ప్రయాగ్ రాజ్ జలాన్ని గ్రామానికి తీసుకొచ్చి ఆలయానికి వచ్చిన వారికి వితరణ చేశారు.ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సునీల్ ను గ్రామస్తులు,భక్తులు అభినందించారు.

## అల్లం స్వప్న దేవిని సన్మానించిన ఖోఖో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు



గీసుగొండ ఫిబ్రవరి 26 (సూర్య)మండల కేంద్రంలోని స్థానిక జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో గత నెలలో తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ ఖో ఖో పోటీలు విజయవంతంగా నిర్వహించిటకు 5 లక్షల రూపాయలు విరాళంగా అందచేసి, టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి,టోర్నమెంట్ విజయానికి సహకరించిన అల్లం బాల కిషోర్ రెడ్డి సతీమణి అల్లం స్వప్న దేవి ని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోట రాంబాబు,వీరగోని స్వప్న , ప్రభుత్వ ఉపాధ్యాయులు రామ్మూర్తి కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా అల్లం సప్న దేవి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి టోర్నమెంటును గీసుగొండ లో అంగరంగ వైభవంగా నిర్వహించినందుకు టోర్నమెంట్ ఆర్గనైజర్స్ కు,వరంగల్ డిస్ట్రిక్ట్ ఖో ఖో అసోసియేషన్ సభ్యులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

# కోట గుళ్ళకు పోటెత్తిన భక్తజనం

**తెల్లవారుజామున ప్రారంభమైన అభిషేకాలు, పూజలు**

**గణపేశ్వరునికి నందీశ్వరునికి రుద్రాభిషేకం**

**కొనసాగిన భక్తుల రద్దీ**

**ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఓఎస్ డి కిషన్ , డి.ఎస్.పి సంపత్ రావు సీఐ నరేష్ కుమార్ గణపురం ఎస్ఐ అశోక్**

గణపురం రూరల్ ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ సూర్య: కాకతీయుల కళాక్షేత్రం



శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోట గుళ్ళకు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి పోటెత్తారు. తెల్లవారుజామున గణపతి పూజ, అఖండ దీపారాధన తోరణ బంధనం కార్యక్రమాన్ని అర్చకులు గంగాధర్, నాగరాజు, శంకర్ లు నిర్వహించారు. అనంతరం నందీశ్వరునికి, గణపేశ్వరునికి రుద్రాభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయం



కిటకిటలాడింది శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భూపాలపల్లి ఓఎస్ డి బోనాల కిషన్ దంపతులు , డి.ఎస్.పి సంపత్ రావు దంపతులు భూపాలపల్లి సీఐ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్ గణపురం ఎస్ఐ రేఖ అశోక్ దంపతులు అభిషేకంలో పాల్గొన్నారు. శివరాత్రి జాగరణ సందర్భంగా కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు.







# బాండ్ మొక్కజొన్న రైతులకి నష్టపరిహారం చెల్లించాలి

### సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రత్నం రాజేందర్

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 26(మేజర్ న్యూస్ సూర్య ): కన్నాయిగూడెం మండలంలో మొక్క జొన్న పంట వేసి దిగుబడి రాక మోసపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం పార్టీ ములుగు జిల్లా కార్యవర్గ సభ్యులు రత్నం రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ సింజంట కంపెనీ 601 వెరైటీ బాండ్ అనే మొక్క జొన్న గింజలను రైతులకు ఇవ్వడం జరిగిందని అన్నారు. సీడ్ ఫెయిల్ అయ్యి అసలు గింజలు కూడా రాకున్నా కూడా కంపెనీ ప్రతినిధులు పట్టించుకోవడం లేదని తక్షణమే జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వ్యవసాయ అధికారులు స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు. నకిలీ గింజలు ఇచ్చి రైతులను నిండా ముంచిన కంపెనీతో పాటు సంబంధిత డీలర్ పై క్రిమినల్ పెట్టి పీడీ యాక్ట్ కేసులు చేసి నష్టపోయిన రైతులకి ఎకరాకి 1లక్ష రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కావిరి సుధాకర్, రైతు సంఘం నాయకులు కంపెల్లి సురేష్, ఇబ్రహీం పాషా, మంచాల రామారావు, బాధిత రైతులు కుడుముల బాబు, కావిరి నాగయ్య, అంజయ్య, బక్కయ్య, రాంబాబు, మహేష్, వెంకటయ్య, దుర్గా రావు, లక్ష్మిపతి, నందు, డబ్బగట్ల కృష్ణయ్య, దామోదర్, మల్లయ్య, సత్యం, సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తాం

**- 6రూట్లలో 9పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సామాగ్రి**

**-డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరశీలించిన కలెక్టర్ దివాకర టీఎస్**

ములుగు రూరల్, ఫిబ్రవరి 26 ( మేజర్ న్యూస్ సూర్య) : ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని, సిబ్బంది పోలింగ్ సామాగ్రిని సక్రమంగా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులకు సూచించారు. ఆరు రూట్లలో జిల్లాలోని 9కేంద్రాలకు పోలింగ్ సామాగ్రిని తరలించినట్లు వెల్లడించారు. బుధవారం ములుగులోని కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి వితరణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్






మాట్లాడుతూ.. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశామని, జిల్లా వ్యాప్తంగా 628మంది ఓటింగ్ లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి, భోజన వసతి ఏర్పాటు చేయాలని, షామియానాలు ఏర్పాటు చేయాలన్నారు. పీవో, ఏపీవో, ఓపీవోలతో కూడిన బృందాలన్నీ పర్యవేక్షిస్తారని, కేంద్రాల వద్ద 144సెక్షన్ పక్కాగా అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ సామాగ్రి పీ.ఎస్ లకు తీసుకెళ్తున్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) సిహెచ్.మహేందర్ జీ, ఆర్డీఓ వెంకటేష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికలను సక్రమంగా ఎలాంటి పొరపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య**

హనుమకొండ , ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ సూర్య: ఎన్నికలను సక్రమంగా ఎలాంటి పొరపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అన్నారు. బుధవారం స్థానిక కాకతీయ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్స్ ఆవరణంలో వరంగల్ -ఖమ్మం- నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ, మరియు మెదక్ -నిజామాబాద్ ఆదిలాబాద్- కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి  పోలింగ్ మెటీరియల్ పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పరిశీలిస్తూ, సిబ్బందికి తగు సూచనలు చేశారు . అనంతరం కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్లు ,పిఓ లు, ఏపీవోలు, మైక్రో అబ్జర్వర్స్ ఎన్నికలను సక్రమంగా ఎలాంటి పొరపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ అనంతరం  పోలింగ్ బాక్స్ లను  జాగ్రత్తగా సీల్ చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే జోనల్ అధికారిని సంప్రదించాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది సామాగ్రిని తీసుకొని వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రానికి బస్సులలో నాలుగు రూట్లలో రూట్ ప్రకారంగా బయలుదేరారు. హనుమకొండ జిల్లా టీచర్స్ నియోజకవర్గంలో 5215 ఓటర్లు ఉన్నట్టు అలాగే మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్- కరీంనగర్ టీచర్స్ నియోజకవర్గంలో జిల్లాకు సంబంధించి166 మంది ఓటర్లు ఉన్నారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ -కరీంనగర్ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో 4585 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో మొత్తం 24  పోలింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్, పరకాల ఆర్డిఓ



డాక్టర్ కె.నారాయణ, తాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.








# రామలింగేశ్వర స్వామినీ దర్శించుకున్న మార్నేని దంపతులు



వర్ధన్నపేట. ఫిబ్రవరి26(మేజర్ న్యూస్ సూర్య); మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మడికొండ స్వయంభు మెట్టు రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకునీ స్వామి వారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ ₹మార్నేని రవీందర్ రావు - మధుమతి దంపతులు. అనంతరం ప్రధాన అర్చకుడు మార్నెనీ దంపతులకు ఆశీర్వచనాలు ఇచ్చారు

# బతుకుదెరువు బుగ్గి...

**చార్జింగ్ పెట్టిన ఎలక్ట్రిక్ ఆటోకు మంటలు**

**రూ.5లక్షల నష్టం..ఆదుకోవాలని ఆటో డ్రైవర్ విన్నపం**

గీసుగొండ ఫిబ్రవరి 26 (సూర్య)ఎలక్ట్రిక్ ఆటో కాలి బూడిదైన సంఘటన గీసుగొండ మండలం కొమ్మాల గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన భోగి శివకుమార్ ఇంటి ఆవరణలోఉన్న తన ఎలక్ట్రిక్ ప్యాసింజర్ పియా గో ఆటో ఛార్జింగ్ అవుతున్న క్రమంలో ఒకేసారి మంటలు చెలరేగి కాలి పోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. 11 నెలల క్రితం పియాగో అప్పె ఈ సిటీ,టీజీ 24ట 0025 ఎలక్ట్రిక్ ఆటో కొత్తది ఐదు లక్షలతో కొనుగోలు చేశానని తెలిపారు.ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నానని, రోజువారి మాదిరిగానే మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు ఆటోకు చార్జింగ్ పెట్టి ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో పదిన్నర గంటల సమయంలో ఒకేసారి ఆటో నుంచి మంటలు రావడంతో బయటికి వచ్చి చూసేసరికి కాలి మంటల్లో కాలిపోతుండగా.. చుట్టుపక్కల వారి సహాయంతో మంటలు ఆర్పినట్లు తెలిపారు.ఫైనాన్స్లో ఆటో కొనుగోలు చేశానని తెలిపారు.ఆటో తప్పా తన బతుకు దెరువుకు వేరే మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదే విషయంపై గీసుగొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

# కన్నుల పండువగా శివపార్వతుల కళ్యాణం

### స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన జిల్లా కలెక్టర్

కాళేశ్వరం ఫిబ్రవరి 26 (మేజర్ న్యూస్ సూర్య): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లో శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం లో శివ పార్వతుల కళ్యాణం బుధవారం కనుల పండువగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులు పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులకు స్వాగతం పలికారు.. ఆలయ ప్రధాన అర్చకులు త్రిపురారీ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన





ఈ వేడుకలో ప్రత్యేకంగా అలంకరించిన కళ్యాణ వేదిక పై శివపార్వతుల ఉత్సవమూర్తులను ఆశీనుల్ గావించి అర్చకులు, వేదపండితులు వేదమంత్రాల మధ్య స్వామి వారి కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కళ్యాణ వేడుకను కన్నులారా వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో హాజయ్యారు. శివ పార్వతుల కళ్యాణం అనంతరం గోదావరి నది మహాహారతి అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి ఎస్ మహేష్, పర్యవేక్షకులు బుర్రి శ్రీనివాస్ గౌడ్ , గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

### డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సందర్శించి

### పోలింగ్ సామాగ్రి పంపిణీ తీరును పరిశీలించిన కలెక్టర్

జనగామ అర్బన్, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ సూర్య: వరంగల్–ఖమ్మం–నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. పోలింగ్ గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్న నేపథ్యం లో.బుధవారం జనగామ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని అందుకొని, వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సురక్షితంగా తరలివెళ్లారు.ఈ ప్రక్రియని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్వయం గా పరిశీలించారు పోలింగ్ ప్రక్రియపై కలెక్టర్ సూచనలు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు కఠిన చర్యలు






తీసుకున్నామన్నారు 12 పోలింగ్ కేంద్రాలు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయన్నారు పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకుని విధులను నిర్వర్తించాలన్నారు ఓటింగ్ గోప్యతను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలోని ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ఆయన, తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు వంటి అన్ని వసతులు సమర్థంగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతి మూడు మండలాలకు ఒక రూట్ చొప్పున 4 రూట్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలింగ్ సామగ్రి సరైన విధంగా అందిందా అనే విషయాన్ని చెక్లిస్ట్ ఆధారంగా ధ్రువీకరించుకోవాలని పేర్కొన్నారు. బ్యాలెట్ పద్ధతి ప్రకారం పోలింగ్ నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఓటింగ్ కేంద్రాలకు బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బంది తరలింపునకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సామగ్రి తరలింపు సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా సంబంధిత అధికారులను వెంటనే సమాచారం అందించాలని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 12 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, ఆర్డీవోలు గోపీరాం, వెంకన్న, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఏఓ మన్సూర్ తదితర అధికారులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.







# చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం

**ఎస్ఐ రేఖ అశోక్**

**జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోటగుళ్లలో చలివేంద్రం ఏర్పాటు**




గణపురం రూరల్ ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ సూర్య: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని గణపురం ఎస్ఐ రేఖ అశోక్ అన్నారు కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో శివరాత్రి జాగరణ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ ఆయిలి మారుతి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చలివేంద్రాన్ని ఎస్ఐ అశోక్ ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అందులో భాగంగా కోటగుళ్ళు శివరాత్రి ఉత్సవాల్లో చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల ఫౌండేషన్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రేగొండ మండల ఇన్చార్జ్ ఆకుల ప్రతాప్, బీజేవైఎం నాయకులు మంద మహేష్ కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భాను ప్రసాద్ ప్రత్యేక పూజలు



వర్ధన్నపేట,26ఫిబ్రవరి(మేజర్ న్యూస్ సూర్య); శ్రీ రాజ రాజేశ్వర ఆలయంలో వర్ధన్నపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పత్రి భానుప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామం ఆకేరు వాగు ఒడ్డున వెలసిన శ్రీ రాజ రాజేశ్వర ఆలయంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు పత్రి భానుప్రసాద్ యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు ముంజ కృష్ణ,గోధుమల విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# హర హర మహాదేవ్...శంభో శంకర

**గీసుగొండ మండలంలోని పలు శివాలయాల్లో భక్తుల సందడి**

**ఎలుకుర్తి(హా) శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన నిమ్స్ లైజనింగ్ అధికారి మార్త రమేష్**

గీసుగొండ ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ (సూర్య): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.హర హర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తులు శివనామస్మరణ చేస్తూ స్వామిని దర్శిం చుకుంటున్నారు.అన్ని శివాలయాల్లో పంచాక్షరి మంత్రం మారు మోగింది .తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకుని ఆ దేవదేవునికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు,పూజలు చేస్తున్నారు.గీసుగొండ





మండల కేంద్రంలోని శివాలయం,ఎలుకుర్తి హవేలీ గ్రామంలోని శివాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు చేశారు.హర హర మహాదేవ శంభో శంకరా నామస్మరణతో ఆలయాలు మారు మ్రోగాయి. మహాశివ రాత్రిని పురస్కరించుకుని భక్తులు నిష్టగా ఉపవాసం ఉంటారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు మహాశివున్ని స్మరిస్తూ ఉపావాసం చేస్తారు. సాయంత్రం పలు రకాల పండ్లు సేవించి ఉపవాసాన్ని విడుస్తారు.రాత్రంతా జాగారం చేస్తూ శివుడిని స్మరించుకుంటారు.కాగా ఎలుకుర్తి హవేలీ లోని శివాలయంలో నిమ్స్ లైజనింగ్ ఆఫీసర్ మార్త రమేష్ ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయపాల్ రెడ్డి,మాజీ ఎంపిటిసి రవీందర్,బొడిగ శోభన్ గౌడ్,డి. రమేష్,కమలాకర్,వంశీ,జగదీశ్వర్ జయపాల్,అర్చకులు మోహన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఊరూరా శివనామ స్మరణతో మారుమోగిన శివాలయాలు

**జాగారాలు ఉన్న భక్తులకు పాలు పండ్లు చిలకడ దుంపలను అందజేసిన శివ భక్తులు**

రాయపర్తి ఫిబ్రవరి 26 (మేజర్ న్యూస్ సూర్య) : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం శివాలయాలలో శివ భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి మండలంలోని అన్ని గ్రామాలలో శివాలయాలలో ఆలయ కమిటీ సభ్యులు శివాలయాన్ని మామిడి తోరణాలు పూలదండలతో అందంగా అలంకరించి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు భక్తుల కోసం ప్రత్యేకంగా చలువ పందిర్లు వేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యాలను ఏర్పాటు చేశారు శివ భక్తులు ఉదయం నుండే పెద్ద ఎత్తున శివాలయాలకు తరలివచ్చి బిల్వపత్రం ఆవు పాలు తేనెతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు శివ భక్తులు జాగాహారం ఉన్న భక్తులకు పాలు పండ్లతో పాటు



శివునికి ఇష్టమైన చిలుకడ దుంపలను అందజేశారు శివరాత్రి ఉత్సవాలతో అన్ని గ్రామాలలో సందడి వాతావరణం నెలకొంది.

# సందరెల్లి ఆలయంలో వైభవంగా శివపార్వతుల కళ్యాణం

**ఆధ్యాత్మిక శోభతో కళకళలాడిన విశ్వేశ్వర ఆలయం**

మల్హర్, ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ సూర్య : భూపాలపల్లి-పెద్దపల్లి ఇరు జిల్లాల సరిహద్దులోని తాడిచర్ల-ఖమ్మంపల్లి గ్రామాల మద్యగల మానేరు సమీపంలో ఉన్న కాకతీయుల కాలం నాటి ప్రాచీన ఆలయమైన శ్రీ త్రికూటేశ్వర విశ్వేశ్వర ఆలయంలో బుధవారం శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఇందారపు లక్ష్మి, చిలుక రాధికల ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చకులు వీరాచారీ వేద మంత్రోఛ్ఛరణలతో పంచామృతాభిషేకాలు, జ్యోతి ప్రజ్వలన, రుద్రాభిషేకాలు, కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా అత్యంత వైభవో





పేతంగా జరిగింది. మహశివ రాత్రిని పురస్కరించుకుని మండలంలోని నైనగుళ్ళు, తాడిచెర్ల హనుమాన్ ఆలయం, పెద్దతూండ్ల, నాచారం మల్లీఖార్జున స్వామి ఆలయాల్లో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. శివపార్వతుల కళ్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి భావంతో తన్మయత్వం చెందారు.

# నైనగుళ్ళలో శివరాత్రి సందర్భంగా భక్తుల సందడి



## పిఎసిఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య ప్రత్యేక పూజలు

మల్హర్, ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ సూర్య : మండలంలోని కొయ్యూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పీవీ నగర్ సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీ మహా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి తాడిచెర్ల పిఎసిఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## భక్తుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు

మల్హర్, ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ సూర్య : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలం నాచారం గ్రామంలో బుధవారం నుండి జరిగే శివరాత్రి జాతర, శివపార్వతుల కళ్యాణానికి వచ్చే భక్తులకు త్రాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారని పలువురి ద్వారా తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి తన టీమ్ సభ్యులతో భక్తుల సౌకర్యార్థం కూలింగ్ వాటర్ క్యాన్లతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. అయిలి మారుతి ఆదేశాల మేరకు దర్శనానికి వచ్చే ఎంతమంది భక్తులకైన త్రాగు నీరు అందించడానికి సిద్ధంగా ఉన్నామని టీం సభ్యులు తెలిపారు. సేవాభావంతో భక్తులకు త్రాగు నీరు అందజేస్తూ ఉదారాతను చాటుకున్న అయిలి మారుతికి భక్తులతో పాటు నాచారం గ్రామ ప్రజలు, యువకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# భక్తుల సౌకర్యార్థం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయం

## రాజ రాజేశ్వర ఆలయ ప్రాంగణంలో వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎస్ఐ రాజు కుమార్

వర్ధన్నపేట, 26ఫిబ్రవరి(మేజర్ న్యూస్ సూర్య); ఆలయానికి వచ్చే భక్తులకు స్వచ్ఛమైన తాగునీటి వసతిని కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమని వర్ధన్నపేట ఎస్ఐ రాజు కుమార్ అన్నారు. బుధవారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని శ్రీ రాజ రాజేశ్వర ఆలయ ప్రాంగణంలో ఇల్లంద గ్రామానికి చెందిన గొడిశాల రోహిత్ తన తాత గొడిశాల రామ స్వామి జ్ఞాపకార్థం ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు.బుధవారం శివరాత్రి పర్వదినం సందర్భంగా వాటర్ ప్లాంట్ ను వర్ధన్నపేట ఎస్ఐ రాజు





కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవలే ఉద్యోగం సాధించి తనకు వచ్చిన మొదటి నెల వేతనాన్ని ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తాగునీటి సౌకర్యం కల్పించే విధంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు వెచ్చించడం హర్షణీయం అన్నారు. ఆలయఅభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రోహిత్ తండ్రి గొడిశాల మల్లేశం,మాజీ ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్,ఆలయ చైర్మన్ మైదం బుచ్చిమల్లు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు పత్రి భానుప్రసాద్, నకిరకంటి రవీందర్,మురారికార్ భాస్కర్,గడ్డం సమ్మయ్య,దీకొండ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రానికి చేరుకున్న మెటీరియల్

### గీసుగొండ మండలంలో 90 మంది ఓటర్లు

గీసుగొండ ఫిబ్రవరి 26 (సూర్య): నేడు జరగనున్న నల్గొండ- వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు గీసుగొండ మండలంలోని జెడ్.పి.ఎస్.ఎస్ పాఠశాలలో పోలింగ్ స్టేషన్ 42 నెంబర్ కు మెటీరియల్, సిబ్బంది చేరుకుందని తహసీల్దార్ ఎండి రియజూద్దీన్ తెలిపారు. మండలంలో 90 మంది ఓటర్లు ఉన్నారని,ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని అన్నారు.ఓటు హక్కు వినియోగించుకునే వారు తప్పనిసరిగా ఓటరు గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు.

## శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు



జఫర్ గడ్, ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ సూర్య:మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు శివాలయాలు భక్తుల శివనామ స్మరణతో మార్మోగాయి.ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని జఫర్ గడ్,కూనూర్, తిడుగు ,తమ్మడపల్లి-ఐ, తిమ్మంపేట గ్రామాలలోని శివాలయాల విద్యుత్ దీపాలతో,రంగురంగుల పూలతోముస్తాబు చేయడం జరిగింది. తెల్లవారు జామునుండే భక్తులు ఆలయాలకు క్యూ కట్టి పరమేశ్వరునికి పూజలు చేసిన అనంతరం శివలింగంనకు పంచామృతాలతో, చెరుకు, ద్రాక్ష రసంతోఅభిషేకాలు చేయడం జరిగింది.సాయంకాలం ఆలయాలలో ప్రత్యేకంగా అలంకరి ంచబడిన మండపాలలో శివ-పార్వతుల కళ్యాణ ఘట్ట మహోత్సవాన్ని వేదపండితులు నిర్వహించారు.కళ్యాణం అనంతరం శివ-పార్వతుల ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు శివనామ స్మరణ చేస్తూ జాగారం చేసారు. ఈ సందర్భంగా దేవాలయలను దర్శనం చేసుకున్న వారిలో జనగామ జిల్లా మహాసభ జోన్ చైర్మన్ గందే సోమన్న,దాంశెట్టి సోమేశ్వర్, జిల్లా వాసవి సేవాదళ్ బోనగిరి శ్రవణ్ కుమార్ బజ్జూర్ కృష్ణమూర్తి గందే సీతారాములు. రేవూరు శ్రీనివాస్ రేవూరి రమేష్ దామోదర్ దొడ్డ రాజ్ కుమార్ బెలేదే పూర్ణచందర్ గందే మురళి ఆౌచురి శ్రీనివాస్ దాంశెట్టి సోమేశ్వర్ బజ్జూర్ సుధీర్ బజ్జూర్ సంతోష్ పట్టూర్ వెంకన్న నాగరాజు తదితరులు పాల్గొన్నారు



# ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి

### -జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
### -ఎన్నికల సామాగ్రి పంపిణీ

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26,మేజర్ న్యూస్ (సూర్య ): ఎమ్మెల్సీఎన్నికల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు.నల్లగొండ-వరంగల్ -ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని ఫాతిమా హైస్కూల్ నుండి



జిల్లాలోని (16) కేంద్రాలకు సంబంధించి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉన్నామన్నారు.కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి, మహబూబాబాద్,తొర్రూరు రెవెన్యూ డివిజన్ అధికారులు కే.కృష్ణవేణి,



జి.గణేష్, ఎన్నికల నోడల్ అధికారులు, సెక్టరల్ అధికారులు తదితరులు ఉన్నారు.







# పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి

**6 రూట్స్ ద్వారా 13 పోలింగ్ కేంద్రాలకు చేరనున్న పోలింగ్ సామాగ్రి**

**అన్ని కేంద్రాల్లో పటిష్ఠ భద్రత**

**ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్**

**ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ పూర్తి**

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సందర్శించిన కలెక్టర్**

వరంగల్, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ సూర్య: వరంగల్, ఖమ్మం,నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం సందర్శించారు. వరంగల్ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను జిల్లా కలెక్టర్క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యాయా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. బ్యాలెట్ పద్ధతి ద్వారా పోలింగ్ ప్రక్రియను జరిపించాల్సిన తీరు గురించి, వెంట తీసుకెళ్లాల్సిన బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ సామాగ్రి గు రించి ప్రయోగాత్మకంగా వివరిస్తున్న తీరును గమనించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించడానికి పంపిణీ కేంద్రానికి వచ్చిన పిఓ, ఓపిఓ, మైక్రో అబ్జర్వర్లు,




అధికారులు పోలింగ్ లో ఎలాంటి లోటు పాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని తెలిపారు. చెక్ లిస్టు ప్రకారం ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా ,లేదా జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. పోలింగ్ సిబ్బందితో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన బస్సులను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి పీ.ఎస్ లకు తీసుకెళ్తున్న సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి సిబ్బంది తమకు కేటాయించిన వాహనాలలో నేరుగా పోలింగ్ స్టేషన్లకు చేరుకుని పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటారని తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలోఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు 2352 మంది ఉన్నారని వివరించారు. 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో పీ.ఓ, ఓపీఓలను నియమించామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కలిగి ఉన్న వారు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్. సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, సంబంధిత అధికారులు, సెక్టోరల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

**వర్ధన్నపేట పిఏసిఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా**



వర్ధన్నపేట,ఫిబ్రవరి26,(మేజర్ న్యూస్ సూర్య): క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని వర్ధన్నపేట పిఏసిఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా అన్నారు.రాయపర్తి మండలం గన్నారం గ్రామంలో జన్నపురెడ్డి శ్రీరామ్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు.ఫైనల్లో వర్ధన్నపేట మండలం కొత్తపల్లి టీమ్ ప్రథమ స్థానం కైవసం చేసుకోగా రెండవ స్థానం గన్నారం గ్రామం కైవసం చేసుకుంది.గెలుపొందిన క్రీడాకారులకు వర్ధన్నపేట పిఏసిఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా ముఖ్యఅతిథిగా హాజరై జన్నపురెడ్డి శ్రీరామ్ రెడ్డి తో కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని అన్నారు.పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు.ఇటువంటి క్రీడలు ఎల్లప్పుడూ నిర్వహించిన తాను ప్రోత్సహిస్తానని తెలియజేశారు. మొదటి బహుమతి కైవసం చేసుకున్న కొత్తపల్లి టీమ్ క్యాప్టెన్ చింతల నాగరాజు తో పాటు టీం సభ్యులను అభినందించారు.

# గిరిపై మార్మోగిన... శివనామార్చన

## భక్తులకు మహా అన్నప్రసాదం నిర్వహించిన రామలింగేశ్వర స్వామి అసోసియేషన్

నెల్లికుదురు ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్(సూర్య): మండలంలోని శ్రీరామగిరిపై స్వయంభుగా వెలసిన పరమేశ్వరునికి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ ఆలయ అర్చకులు కపిలవాయి కృష్ణమూర్తి,నాచి మంత్రోచ్ఛరణతో ప్రత్యేక పూజలు,అభిషేకాలు,అష్టోత్తరాలు నిర్వహించారు.అనంతరంమహబూబాబాద్ కరెంటు ఎస్సీ జనగం నరేష్ సుజాత దంపతులు స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ వారికిశాలువ కప్పి సత్కరించారు.గిరి కిందశ్రీ రామలింగేశ్వర స్వామి అసోసియేషన్ అధ్యక్షులు చీమకుర్తి శ్రీనువాస్,కార్యదర్శి గొల్లపల్లి నరేష్ ఆధ్వర్యంలో మండలభక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.అసోసియేషన్ అధ్యక్షులు





శ్రీనివాస్ మాట్లాడుతూగత కొన్ని సంవత్సరాలుగా ఆలయానికి వస్తున్న భక్తులకుఅసోసియేషన్ తరపునమహా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామనిఆ పరమేశ్వరుని కృపతోమహా అన్నదానానికి దాతలుముందు కొస్తున్నారని అన్నారు.స్వయంభుగావెలసినరామలింగేశ్వర స్వామి వద్ద కోరిన కోర్కెలు నెరవేరడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చిస్వామివారిని దర్శించుకుని మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచ్ డోనికెన జ్యోతి శ్రీనివాస్,మాజీ ఉపసర్పంచ్ గంజి గోవర్ధన్,అసోసియేషన్ కోశాధికారి సామల నరసయ్య,ఫైండ్ల శ్రీనివాస్,గ్రామం నుంచి గిరి వరకు ఉచితంగా ఆటోనడిపిన గొల్లపల్లిమల్లేష్ గౌడ్,నవీన్,బెల్లి నరసయ్య అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి నాలుగేళ్ళ చిన్నారి మృతి



స్టేషన్ ఘనపూర్,ఫిబ్రవరి26,మేజర్ న్యూస్(సూర్య):జనగామ జిల్లా చిల్పూర్ మండలం నష్కల్ కు చెందిన పాశం రాజు అపూర్వ దంపతుల కూతురు తనస్వి (4) అనే చిన్నారి బుధవారం స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రంలోని అమ్మమ్మ ఇంటి వద్ద ప్రమాద వశాత్తు నీటి తొట్టిలోపడి మృతి మృతి చెందడం జరిగింది.తనస్వి మృతితో నస్కల్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బంధువుల రోధనలు మిన్నంటాయి.

# పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది




స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి26,మేజర్ న్యూస్(సూర్య): నేటి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వరంగల్ -ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలలో బాగంగా స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలోని 12 వ పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సిబ్బంది బుధవారం చేరుకుంది. ఈ సందర్భంగా పీవో సీహెచ్ జగన్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. మండల పరిధిలో మొత్తం 67 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారని ప్రతి ఒక్కరు ఓటు హక్కును తప్పనిసరి ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఎం.ప్రవీణ్ ,ఓపివోలు రాజపోచయ్య, జంగ రవి,ఆర్ఐ లు సతీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రేగొండలో ఘనంగా శివరాత్రి వేడుకలు

## శివనామ స్మరణతో మార్మోగిన మండలంలోని ఆలయాలు

రేగొండ,ఫిబ్రవరి 26,మేజర్ న్యూస్ (సూర్య): మహా శివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని ఆలయాలలో ప్రజలు శివనామ స్మరణతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గడిపల్లి గ్రామంలో మహా శివరాత్రి సందర్భంగా పురాతన కాలంలో నిర్మించినటువంటి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మహా శివరాత్రి సందర్భంగా అర్చనలు,అభిషేకాలు భక్తి శ్రద్ధలతో ఉపవాసాలతో దేవుని కొలిచారు. తెల్లవారుజాము నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని ప్రత్యేక అలంకరణతో సుందరంగా ముస్తాబు చేశారు.

భక్తులు ఎంతో నియమ నిష్ఠలతో ఉపవాసాలు దీక్షలు స్వామివారి సేవలో పాల్గొని శ్రీ రామలింగేశ్వర స్వామి కృపకు పాత్రులు అవుతున్నారు.ఈ కార్యక్రమంలో శివరాత్రి సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమని దోపతి ఇంద్ర సమ్మిరెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



# దేశంలోమతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి

## సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపు

తొర్రూర్ ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ (సూర్య): దేశంలో నరేంద్ర మోడీ గత 11 సంవత్సరాల కాలంలో మతోన్మాద విధానాలను పెరగడానికి ఊత మిస్తుందని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28న న్యూఢిల్లీలో జరుగు అఖిల భారత సదస్సు జయప్రదం చేయాలని బుధవారం తొర్రూర్ లో ప్రచారం,సభ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన రవి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని స్వయం ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలను ఒక ప్లాను ప్రకారం నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆకాశాన్నంటుతున్న ధరలు అంతులేని నిరుద్యోగం, పేదరికం ఆకలి చావులు లాంటి మౌలిక సమస్యలను ఆలోచించకుండా మతం మత్తులో ప్రజలను ముంచుతున్నారని అన్నారు. మరోవైపు దేశ సహజ, సర్వసంపదను అంబానీ, అధాని లాంటి కార్పొరేట్ సంస్థల దోపిడీకి గేట్లు తెరిచారని విమర్శించారు. ప్రజల సాంప్రదాయ పండుగలని ఆచారాలను కూడా హిందుత్వ రంగు పులిమి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వీటిపై విశాల ఐక్య ఉద్యమాలను తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తొర్రూరు డివిజన్




కార్యదర్శి ముంజంపల్లి వీరన్న మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. కేంద్రంలోని బిజెపి విధానాలపై సూత్ర బద్ద పోరాటం చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అర్వపల్లి వెంకన్న మాచర్ల మురళి, బానోతు నందీశ్వర్,బానోతు రవీందర్, రాములు సుగుణమ్మ అనిత రాములమ్మ,ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మారు మ్రోగిన శైవ క్షేత్రాలు

### మహాశివరాత్రి సందర్భంగా పలు ఆలయాలల్లో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే దంపతులు

టేకుమట్ల ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ సూర్య : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు శైవ క్షేత్రాలలో హర హర మహాదేవ శంభో శంకర, శివనామ స్మరణతో మారు మ్రోగాయి. బుధవారం మహాశి వరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి నియోజకవర్గంలోని పలు శివాలయాలను, మల్లన్న జాతరలను మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు - పద్మ దంపతులు స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి టేకుమట్ల మండలంలోని బూర్నపల్లి గ్రామ గుట్టపై కొలువుదీరిన గట్టు మల్లన్న, వెలిశాల గ్రామం శివకేశవ ఆలయం, రాఘవరెడ్డిపేట గ్రామం శివ ఆలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పద్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈరోజు శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజలంతా భక్తిశ్రద్ధలతో శివనామం జపిస్తూ, ఉపవాస దీక్షలు, రాత్రి చేసే జాగరణ, పూజలు అభిషేకాలు వంటి కార్యక్రమాలు ప్రతీ ఒక్కరిలో భక్తిభావం పెంపొందించేలా చేస్తాయని అన్నారు. ఆ మహాశివుని కరుణకటాక్షాలు ప్రజకందరిపై ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆ భగవంతున్ని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోటగిరి సతీష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ పులి తిరుపతిరెడ్డి, జిల్లా నాయకులు కత్తి సంపత్ గౌడ్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనుమరుగు ల సంపత్, యూత్ కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు



బండ శ్రీకాంత్ ఆయా గ్రామాల మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు మండల పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు





# వృద్ధురాలిని హత్య కేసును చేదించిన పోలీసులు

### బంగారు వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన ముగ్గురు నిందితుల అరెస్టు

చిట్యాల, మార్చి 26 మేజర్ న్యూస్: టేకుమట్ల మండలం గరిమిళ్ళపల్లి శివారు బోయినపల్లి గ్రామానికి చెందిన సోరుపాక వీరమ్మ(70) అనే వృద్ధురాలను మంత్రాల నెపంతో హత్య చేసి గోనె సంచిలో కుక్కిబావిలో పడేసి బంగారం ఎత్తుకెళ్లిన కేసులో ముగ్గురు నిందితులను బుధవారం అరెస్ట్ చేసినట్లు భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు తెలిపారు. బుధవారం చిట్యాల సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో హత్య కేసు వివరాలను డిఎస్పి సంపత్ రావు వెల్లడించారు. టేకుమట్ల మండలం. గర్మిళ్ళపల్లి గ్రామ శివారు బోయినపల్లి గ్రామానికి చెందిన సోరుపాక వీరమ్మ, అనే మహిళ వారం రోజుల క్రితం తను సేకరించిన చింత పండును తన పక్క గ్రామమైన గర్మిళ్ళపల్లికి అమ్ముకోవడానికి వెళ్లి అదృశ్యమైనది. తెల్ల వారి తన కుమారులు విషయాన్ని బంధువుల ఇల్లు చుట్టు పక్కల ప్రాంతాలను వెతకగా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. ఈ నెల 23న బోయినపల్లి గర్మిళ్ళపల్లి మధ్యలో ఉన్న పసిక మనమ్మ కు చెందిన వ్యవసాయ బావిలో నుండి కంపు వాసన గమనించిన బాటసారి బోయిని సంపత్ బావి దగ్గరకు వెళ్లి చూడగా ఒక గుర్తు తెలియని శవం నీటి పై తేలాడుతూ కనబడింది. గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా గ్రామస్తులు బావిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా అట్టి శవం సోరుపాక వీరమ్మ గా గుర్తించారు. మహిళను గుర్తు తెలియని వ్యక్తులు చంపి చేతులు వెనుకకు తాడుతో కట్టి గోనె సంచిలో కుక్కి బావిలో వేసినట్లుగా కుటుంబ సభ్యులు టేకుమట్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు




చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గర్మిళ్ళపల్లె లోని సీసీ టీవీ కెమెరాలు టెక్నికల్ సాక్షాలు ద్వారా కొంత మంది అనుమానితుల్ని విచారణ చేస్తుండగా ముగ్గురు నిందితులు పోలీస్ స్టేషన్ లో లొంగిపోయారు. నిందితులలో ఒకరైన బోయిని మల్లయ్య చిన్న కూతురుకి అనారోగ్యం కారణంగా ఎన్ని హాస్పిటల్స్ తిరిగిన నయం కాకపోవడంతో తన ఇంటికి సమీపంలో నివాస ముంటున్న సోరుపాక వీరమ్మ మంత్రాలు చేస్తుందనే అనుమానం పెంచుకున్నాడు. ఆమె ను చంపితే తన కూతురు ఆరోగ్యం బాగుపడు తుందని నమ్మిన మల్లయ్య తన బంధువైన పుట్టకొక్కుల శ్రీనివాస్ అలియాస్ కిట్టు, కిట్టు స్నేహితుడైన మద్దెల సిద్ధు సహాయం కోరగా ఒప్పుకున్నారు. రెండు నెలల నుండి వీరమ్మ కదలికలను గమనిస్తూ ఈ నెల 19న సాయంత్రం వీరమ్మ ఒంటరిగా గర్మిళ్లపల్లి వైపు వెళ్లడం చూసి ఇదే సరైన సమయం అని భావించి మల్లయ్య కిట్టు ఇద్దరు కూడా సిద్ధు బైక్ మీద వెళ్లి గర్మిళ్ళపల్లి సెంటర్ నుండి తిరిగి వస్తున్న వీరమ్మని వెంబడించి పసిక మనమ్మ వ్యవసాయ బావ వద్దకు రాగానే చుట్టు పక్కల ఎవరూ లేనిది గమనించి ఇద్దరు కలిసి వృద్ధురాలని చెట్లపొదలు తీసుకెళ్లి గొంతు పిసికి చనిపోయిన తర్వాత ఆమె శరీరం పైన ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, 30 తులాల వెండి కడాలు తీసు కొని సిద్ధు ద్వారా గోనె సంచి తాడు తెప్పించుకొని వీరమ్మని చేతులు కట్టేసి గోనె సంచి కుక్కి ఎవరికి అనుమానం రాకుండా ఉండాలని బావిలో వేసి వెళ్లిపోయినామని నేరం ఒప్పుకున్నారు. బుధవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కి పంపినట్లు డి.ఎస్.పి సంపత్ రావు తెలిపారు. కేసును చేదించిన చిట్యాల సిఐ డి మల్లేశ్ యాదవ్, టేకుమట్ల ఎస్.ఐ సుధాకర్, ఏ ఎస్ ఐ. అమరేందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ మహేందర్ నాగరాజు, రంజిత్, సతీష్ లను భూపాలపల్లి డి.ఎస్.పి సంపత్ రావు అభినందించినారు.

## రామప్పలో మహా శివరాత్రి జాతర ఏర్పాట్లు

### 300మంది సిబ్బంది తో బారి భద్రత- డిఎస్ పి రవీందర్



వెంకటాపూర్(రామప్ప) పిబ్రవరి 26మేజర్ న్యూస్ సూర్య : యునెస్కో గుర్తింపుపొందిన సుప్రశిద్ద రామప్ప దేవాలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరలో పాల్గొనడానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ట్రాఫిక్ మరియు క్యూ లైన్స్ వద్ద ఎటువంటి అవాంఛనియా సంఘటనలు జరగకుండా ఉండేందుకు ములుగు డిఎస్ పి ఆధ్వర్యంలో 300 మంది సిబ్బందితో కట్టుదిట్టమైనభారీభద్రత, బందోబస్త్ ఏర్పాట్లు చేసి నట్లు ఎస్ పి శబరీస్ తెలి పారు. భక్తులు అధికంగా ఉండేఅవకాశంఉన్నందన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు మఫ్టీలో సిసిఎస్ సిబ్బంది వున్నారని అలాగే ఆలయానికి వచ్చే భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని పోలీస్ సిబ్బందికివారు సూచించడం జరిగింది.

## ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

### ప్రధాన న్యాయమూర్తి నిర్మల గీతాంబా

### దేవాలయం ముందు న్యాయ సేవల స్టాలు



వరంగల్ లీగల్: ఫిబ్రవరి 26 :మేజర్ న్యూస్ (సూర్య) ప్రజలు వివిధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ నిర్మల గీతాంబా అన్నారు.వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం కాశిబుగ్గ లోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం ముందు ప్రత్యేక స్టాల్ ను ఏర్పాటు చేసి, సందర్శకులకు చట్టపరమైన సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలందరూ వివిధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సామాన్య ప్రజలకు న్యాయ సేవలు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో న్యాయ సేవల స్టాల్ ను ఏర్పాటు చేశామని, చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, చట్టానికి పేద, ధనిక అనే భేదం ఉండదన్నారు. జాతీయ లోక్ అదాలత్ గురించి తెలుపుతూ, వచ్చే నెల మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేస్తున్నామని రాజీమార్గం ద్వారా తమ కేసులు పరిష్కరించుకోవాలని, తద్వారా ప్రశాంతమైన జీవనం గడపాలని కోరారు. ప్రజలకు న్యాయ సహాయం అవసరమైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను ఆశ్రయించి ఉచిత న్యాయ సేవలు, సలహాలు పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థలకు సంబంధించిన వివిధ చట్టాల కరపత్రాలను సందర్శకులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి,న్యాయమూర్తి యం.సాయికుమార్, జువైనల్ జస్టిస్ బోర్డ్ సభ్యుడు మేరుగు సుభాష్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మహాశివరాత్రి పర్వదిన వేడుకలు



స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి26,మేజర్ న్యూస్(సూర్): మహాశివరాత్రి పండుగ సందర్బంగా జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం పరిధిలోని పలుగ్రామాల్లో వేడుకలు బుధవారంఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలి కేంద్రంలోని స్వయంభూ రాంశలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు బారులు తీరారు.అర్చకులు తాటికొండ రామలింగం ,ప్రవీణ్ కుమార్ ల మంత్రోచ్చరణల నడుమ గర్భ గుడిలోని శివలింగానికి ఆవు పాలతో భక్తులు అభిషేకాలు నిర్వహించి పూలు పండ్లు సమర్పించారు. అలాగే శివునిపల్లి గ్రామంలోని నగరేశ్వర ఆలయంలో అర్చకులు మోహన్ శర్మ





మంత్రోచ్చరనల నడుమ భక్తులు పూజలు అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా ఇప్పగూడెం గ్రామంలోని నాగులమ్మ గుడిలో భక్తులు మహా శివునికి పూజలు అభిషేకాలు చేయడం జరిగింది.ఈ సందర్భంగా రాత్రి భక్తులుజాగారం చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్ రెడ్డి కుటుంబ సభ్యులతోపాటు పిఏసీఎస్ డైరెక్టర్ చట్ల యాకయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, జిల్లా నాయకుడు కొలిపాక సతీష్ దంపతులు, మాజీ ఎంపీటీసీ తోట లతవెంకన్న దంపతులు, సమ్మక్క సారక్క కమిటీ మాజీ చైర్మన్ మందపురం ఎల్ల గౌడ్ కవిత దంపతులు తదితరులు పాల్గొన్నారు.

# శ్వేతార్క గణపతి ఆలయంలో రుద్రాభిషేకాలు

వరంగల్ లీగల్: ఫిబ్రవరి 26 :మేజర్ న్యూస్ (సూర్య)హనుమకొండ జిల్లా కాజీపేట శ్వేతార్కమూల గణపతి స్వామి దివ్య క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ సంతా నాగలింగేశ్వర స్వామి వారికి మహాశివరాత్రి వేడుకల సందర్భంగా బుధవారం తెల్లవారుజాము 4:30 నుండి నిరంతరాయంగా రుద్రాభిషేకాలు నిర్వహించారు. దేవాలయ వైదిక నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణశర్మ, సాయి కృష్ణ శర్మ ఆధ్వర్యంలో భక్తులచే త్రిశూల మహా రుద్ర పాశుపత అభిషేకము నిర్వహించగా,ఉదయం 11 గంటలకు ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు.అనంతరం లక్ష్మీనారాయణ రుద్ర గణపతి నవగ్రహ హోమాన్ని





అయినవోలు సాయి కృష్ణ శర్మ నిర్వహించారు. అనంతరం రాత్రి 9.30 నుండి లింగోద్భ కాలం వరకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం సహస్ర లింగార్చన పూజలు, భక్తులచే సాహిత్య సాంస్కృతిక, జాగరణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 9 గంటలకు అన్నాభిషేకము,మహా రుద్ర హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ హనుమకొండ కాజీపేట,వ్యాపారస్తులు తదితర భక్తులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

### మహా శివరాత్రి పర్వదినాన శివ నామ స్మరణతో మారుమోగిన శైవ క్షేత్రం

### త్రివేణి సంగమంలో భక్తుల పుణ్యస్నానాలు

కాళేశ్వరం ఫిబ్రవరి 26 (మేజర్ న్యూస్ సూర్య): దక్షణకాశి గా పేరుగాంచిన అరణ్య శైవ క్షేత్రం కాళేశ్వరం లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కించుకుని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు..త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి తెల్లవారు జామునుంచే స్వామి వారి దర్శనం కోసం క్యూ లైన్ లో వేచివున్నారు. తెలంగాణ,మహారాష్ట్ర,ఛత్తీస్గఢ్ రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిం చారు.శుభానంద అమ్మవారికి కుంకుమ అర్చన పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ ఆవరణం శివనామ స్మరణతో మారు మ్రోగింది.ఆలయ అధికారులు భక్తులకు అనుగుణంగా అన్నదానం,తాగునీరు వసతులు ఏర్పాట్లు చేశారు.ప్రదీప్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద పౌర సేవా సంస్థ మంచిర్యాల వారు భక్తులకు మజ్జిగ వితరణ చేశారు.









# కడియం శ్రీహరి గాలిలో కాదు ఎదురు గాలిలో గెలిచాడు

### రాజయ్యకు టిక్కెట్ ఇచ్చే దమ్ముందా కేటీఆర్

### బీఆర్ ఎస్ లో చేరింది ఆపార్టీ వాళ్లే కాంగ్రెస్ వాళ్లు కాదు

### నియోజకవర్గంలో గత పదేళ్లలో అభివృద్ధి శూన్యం

### కాంగ్రేస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకుడు బెలిదె వెంకన్న

స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి 26,(మేజర్ న్యూస్):మాజీ ఉపముఖ్య మంత్రి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ గాలిలో గెలిచాడని కేటీఆర్ పదే పదేఅనడం హాస్యాస్పదమని ఆయన గాలిలో కాదు ఎదురు గాలిలో గెలిచాడని కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకుడు బెలిదె వెంకన్న అన్నారు. జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రంలో బుధవారం విలేకర్లతో వెంకన్న మాట్లాడుతూ బీఆర్ ఎస్ పార్టీ గాలిలో కడియం గెలిస్తే లక్ష ఓట్ల మెజారిటీ రావాలి కదా అదేవిధంగా బీఆర్ ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఎందుకు పరాజయం పాలయ్యారని కేటిఆర్ ను ప్రశ్నించారు. రాజయ్య అసమర్థుడని,అవినీతి పరుడని గతంలో నియోజకవర్గాన్ని అధోగతి పలు చేశాడని ఆయనచేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. కడియం శ్రీహరినీతి నిజాయితీ కలవాడు కాబట్టి నియోజకవర్గాన్ని అబివృద్ధి చేస్తాడనే నమ్మకంతో ప్రజలు గెలిపించారని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోలేని కేటీఆర్ ప్రగల్భాలు పలుకుతున్నాడని ఇప్పుడు జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థే లేడని ఎద్దేవా చేశారు.సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి కడియం కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగిందన్నారు.నియోజకవర్గ ప్రజలు ఆయన వెంటే ఉన్నారని ఒక వేళ ఉప ఎన్నికలు వస్తే కాంగ్రెస్ పార్టీ నుంచి కడియం శ్రీహరి సింహంలా బరిలోకి దిగి లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తారని బీఆర్ ఎస్ పార్టీ నుంచి రాజయ్యకు టిక్కెట్టు ఇచ్చే దమ్ము కేటిఆర్ ఉందా అని సవాల్ విసిరారు.కల్వకుంట్ల కుటుంబమంతా రాష్ట్రాన్ని దోచుకుని అప్పులపాలు చేసి తమ ఉనికిని కాపాడుకోడానికి కేటీఆర్ ఊకదంపుడు ఉపన్యాసలిస్తున్నాడని ఆరోపించారు. మంగళవారం రాజయ్య పరంగా బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారంతా ఆపార్టీకి చెందిన వారేనని కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్కరు కూడా చేరలేదని ఎద్దేవా చేశారు. కేటీఆర్ భ్రమలో ఉన్నాడని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు,కార్యకర్తలు ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెంటే ఉన్నారనే విషయంగత పదేళ్లలో నియోజకవర్గం అభివృద్ధి లో ఎంత వెనుకబడి ఉందొ ఆయన ఇక్కడికి వచ్చి చూస్తే తెలుస్తుందన్నారు.నిత్యం ప్రజలమధ్యే ఉంటూ నిరంతరం రైతుల,నియోజక వర్గ ప్రజల సంక్షేమం కొరకు పాటుపడుతున్నకడియంతోనే నియోజకవర్గ అభివృద్ధి జరిగుతుందని వెంకన్న అన్నారు.ఈ సమావేశంలో జిల్లా నాయకులు అంబటి కిషన్ రాజు,పల్లె రవీందర్, జీడీ రమేష్,సట్ల రాములు,పొగాకు సోమయ్య,కడియం యువసేన మండలాధ్యక్షుడు జీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## వనిత ప్లాటినం క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు అభిషేక సామగ్రి వితరణ



స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి26,మేజర్ న్యూస్ (సూర్య):మహాశివరాత్రి పండుగ సందర్బంగా బుధవారం జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటి కేంద్రంలోని స్వయంభూ శ్రీ రామలింగేశ్వర స్వామి మర్రిచెట్టు శివాలయంలో నూతనంగా ఏర్పడిన వనిత ప్లాటినం క్లబ్ స్టేషన్ ఘనపూర్ అధ్యక్షురాలు గన్ను కళావతి,సెక్రెటరీ పోకల స్వర్ణమంజుల, కోశాధికారి గన్ను జయలలిత అలాగే కార్యవర్గం వారిచే అభిషేకానికి సంబంధించిన ఆవు పాలు,పూలు,అరటి పండ్లు భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైశ్య సంఘ అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి గన్ను నర్సింహులు, వనిత జిల్లా అధ్యక్షురాలు వరూధుని, ప్రధాన కార్యదర్శి గంగి శెట్టి అనుజ,వైశ్య సంఘం జిల్లా రీజియన్ ఛైర్మెన్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## తాడిచెర్ల లో వైభవోపేతంగా శివ పార్వతుల కళ్యాణం

### హనుమాన్ పంచాయతన ఆలయంలో మార్మోగిన శివ నామస్మరణ



మల్హార్, ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ సూర్య : మండల కేంద్రమైన తాడిచెర్ల లోని హనుమాన్ శివ పంచాయతన ఆలయంలో బుధవారం శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోఛ్ఛరణలతో పంచామృతాభిషేకాలు, జ్యోతి ప్రజ్వలన, రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తుల ఓం నమశ్శివాయ అనే శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం అంతా మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ పంచాయతన దేవాలయంలో తొలి సారి శివపార్వతుల కళ్యాణ మహోత్సవం నిర్వహించడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

## కుంభమేళాలో చల్లా దంపతులు



పరకాల, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ సూర్య: మహా కుంభమేళా సందర్భంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ రాజ్ లోని గంగా, యమున,సరస్వతి నదుల త్రివేణి సంగ మంలో పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి దంపతులు పుణ్యస్నానం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలుపుతూ ఆ భగవంతుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు వారు తెలిపారు.



## చెన్నకేశవ స్వామి ఆలయంలో మాజీ జెడ్పిటిసి ప్రత్యేక పూజలు



మొగుళ్ళపల్లి ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ (సూర్య ) మొగుళ్ల పల్లి మండలంలోని పర్లపల్లి గ్రామంలో కాకతీయుల నాటి శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదిన %శీ% పురస్కరించుకొని మాజీ జెడ్పిటిసి జోరుక సదయ్య, పర్లపల్లి మాజీ సర్పంచ్ జోరుక ప్రేమలత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పర్లపల్లి గ్రామంలో ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా జాతర మహోత్సవం చేపట్టడం గర్వకారణం అన్నారు. చుట్టు పది గ్రామాల నుండి భక్తులు చెన్నకేశవ స్వామి జాతర మహోత్సవానికి విచ్చేస్తారని తెలిపారు.ఆ పరమశివుని దయాకృప ప్రజలపై ఉండాలనిఆ కాంక్షించారు.

## 106 ఏండ్ల వృద్ధురాలు మృతి



శాయంపేట, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ సూర్య : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన జక్కుల మల్లమ్మ( 106) బుధవారం ఉదయం మృతి చెందింది. ఆమెకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, 28 మంది మనవళ్లు మనవరాలు, ముని మనవరాలు ఉన్నారు.

## శ్రీ సాంబమూర్తి దేవాలయంలో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు.

మొగుళ్ళపల్లి ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ (సూర్య )మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీ సాంబమూర్తి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినవేడుకలను ఘనంగా నిర్వహించారు.బుధవారం రోజు మహాశివరాత్రి సందర్భంగా మొగుళ్ళపల్లి లోని శ్రీ సాంబమూర్తి దేవాలయంలో సుప్రభాత సేవలో మాజీ సర్పంచ్ మోటే జ్యోతి ధర్మారావు దంపతులతో. ఆలయ వేద పండితులు భైరవభట్ల వెంకటేశ్వర శర్మ శివపార్వతులకు అభిషేకంతో పాటు హోమాన్ని నిర్వహించి ప్రత్యేకంగా పూజలు జరిపించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ధర్మారావు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అత్యంత భక్తిశ్రద్ధలతో శివుని పూజించడం తో పాటు , మహిళలు జాగరణ చేపడతారని అన్నారు. శివుని కృప ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ పూజా కార్యక్రమంలో. మోటే కళావతి బాబురావు, బత్తిని అనిత రమేష్, జూనియర్ లైన్మెన్ రవళి, రమేష్ దంపతులతో పాటు దేశిని జయశంకర్, వీ ణవంక నవీన్, ఎలకంటి శ్రీను, అన్నారపు కుమార్, శ్రీపతి శ్రీనివాస్, పాల్గొన్నారు.

# త్రికూటేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు





## భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

## కన్నుల పండువగా శివపార్వతుల కళ్యాణం

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 26(మేజర్ న్యూస్ సూర్య):మహాశివరాత్రి పర్వదిన వేడుకలు భీమదేవరపల్లి మండల వ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. శివరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం తెల్లవారుజాము నుంచే మండలంలోని త్రికూటేశ్వరాలయం, కైలాస కళ్యాణి క్షేత్రం, సాంబమూర్తి స్వామి దేవాలయం, పాత శివాలయం కు భక్తులు బారులు తీరారు. ఉదయం ఆలయాల్లో శివ లింగ మూల విరాట్ లకు అర్చకులు మహన్యాస రుద్ర పూర్వక వేదమంత్రాల నడుమ అభిషేకాలను నిర్వహించారు. మండలంలోని ముత్తారంలో కాకతీయుల కాలంలో నిర్మించిన అతి ప్రాచీన పురాతన త్రికూటేశ్వరాలయం శివనామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయంలోని బ్రహ్మసూత్ర లింగాన్ని భక్తులు దర్శించుకునేందుకు పోటెత్తారు. ఆలయంలో ముందుగా గణపతి పూజ, అఖండ దీపారాధన తో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అర్చకులు రుద్రాభిషేకం, బిల్వార్చన, మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు శివపార్వతుల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మెట్టు రామలింగేశ్వరుడుకి ప్రత్యేక అభిషేకం నిర్వహించిన ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు

కాజీపేట ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ (సూర్య) కాజీపేట మడికొండలోని దక్షిణ కాశీగా పిలవబడే స్వయంభు శ్రీ మెట్టు రామలింగేశ్వర క్షేత్రంన్నీ మహాశివ శివరాత్రి పర్వదినం సందర్భంగా లింగ రూపంలో ఉన్న దేవదేవుడికి ప్రత్యేక పూజ అభిషేకం కార్యక్రమాలు నిర్వహించిన వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపీఎస్ అధికారి వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్ నాగరాజు. మెట్టు రామలింగేశ్వర దివ్య క్షేత్రానికి పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి వచ్చిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు ఆలయ చైర్మన్ పైడిపాల రఘు చందర్ మరియు డైరెక్టర్లు, అర్చకులు స్వామివారి శేష వస్త్రాలు కప్పి ఆలయంలోకి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజ అభిషేకం అనంతరం మీడియాతో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో పవిత్రంగా ఉపవాసం ఉండి దేవదేవుడు అనుగ్రహం పొందేందుకు భక్తులు గొప్పగా నిర్వహించుకునే పండుగ మహాశివరాత్రి అని. ఆ పరమశివుని ఆశీస్సులు తెలంగాణ రాష్ట్రం ప్రజలు మరియు నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆ పరమశివుడిని వేడుకున్నారని, ఈ కార్యక్రమంలో మెట్టు రామలింగేశ్వర దివ్య క్షేత్రం చైర్మన్ పైడిపాల రవిచంద్ర డైరెక్టర్లు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# బిఆర్ అంబేద్కర్ విగ్రహం తీసివేయడం హేయమైన చర్య




## బి ఆర్ అంబేద్కర్ విగ్రహం తీసి మనువాదుల ఫొటో పెట్టిన ఢిల్లీ సి ఎం ను పదవి నుండి తొలగించాలి

## మాలమహానాడు జాతీయ అధ్యక్షులు పసుల రాంమూర్తి

వరంగల్ ప్రతినిధి26 మేజర్ న్యూస్(సూర్య)డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం తీసి వేయడం హేయమైన చర్య అని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు పసుల రాంమూర్తి అన్నారు.మాల మహానాడు వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు మన్నే కరుణాకర్ అధ్యక్షతన శంభునిపేట సర్కిల్లో నిరసన చేపట్టిన కార్యక్రమానికి జాతీయ అధ్యక్షులు పసుల రాంమూర్తి హాజరై మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం తీసివేసి అదే స్థానంలో మనువాదుల పోటో పెట్టడం హేయమైన చర్య అని అన్నారు.ఢిల్లీ సిఎం డా బి ఆర్ అంబేద్కర్ ను అవమానం చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. సిఎం ఆఫీస్ లో ఉన్నటువంటి డా బిఆర్ అంబేద్కర్,భగత్ సింగ్ ఫొటోలు తీసివేసిన సి ఎం ను ముఖ్య మంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.బీజేపీ మనువాద నాయకుల ఫొటోలు పెట్టు కోవడం సిగ్గు మాలిన చర్య అన్నారు. రాజ్యాంగానికి విరుద్దంగా ప్రవర్తించిన బిజెపి కి దేశ ప్రజలు,అంబేద్కర్,భగత్ సింగ్ వాదులు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు ఉసిల్ల మల్లయ్య,జిల్లా కార్యదర్శి కారు శ్రీపాల్,మగ్గిడి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మొగుళ్ళపల్లిలో పర్యటించిన మాజీ స్పీకర్ మధుసూదనా చారి



మొగుళ్ళపల్లి ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ (సూర్య ) మహాశివరాత్రి పర్వదిన%శీ% సందర్భంగా మొగుళ్లపల్లి మండలంలో తెలంగాణ రాష్ట్ర తొలి స్పీకర్ మాజీ భూపాల్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సిరికొండ మధుసూదనాచారి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మొగుళ్ల పల్లి మండల కేంద్రంలో గల పెద్దమ్మ తల్లి గుడి కి వెళ్లి మొక్కులు చెల్లించారు. అనంతరం మండల కేంద్రంలో గల సాంబమూర్తి దేవాలయంలో పూజలు చేపట్టారు. పిడిసిల్ల గ్రామంలోని శివాలయం, పర్ల పెల్లి గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పాడిపంటలతో,ఆయుఆరోగ్యాలతో, సుఖశాంతో శాలతో కలకాలం వర్ధిల్లాలని మహాశివున్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం మొగుళ్ల పల్లి మాజీమండల అధ్యక్షులు చదవు అన్నా రెడ్డి మధుసూదనాచారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అయన వెంట సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు చదువు అన్నా రెడ్డితో పాటు , దోమకుంట్ల రమేష్, చెక్క శ్రీధర్, గునిగంటి చిరంజీవి, గుడిమల్ల రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య



వరంగల్ ప్రతినిధి ఫిబ్రవరి26 మేజర్ న్యూస్ (సూర్య)అరేపల్లి వ్యవసాయ కళాశాల లో బిఎస్సి మొదటి సంవత్సరం చదువుతున్న జి రేష్మిత బుదవారం రోజు ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది.స్థానిక ఎనుమాముల పోలిస్ స్టేషన్ సిఐ ఎ రాఘవేందర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుంటోజు రేస్మిత,వయస్సు 19 సంవత్సరాలు,నల్గొండ జిల్లాకు చెందిన ఆమె ఆరేపల్లి అగ్రికల్చర్ కాలేజీ లో బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరం చదువుతుంది.బుదవారం ఉదయం తాను ఉంటున్న రూమ్ తలుపు తీయక పోవడంతో తన తండ్రి గుంటోజు సత్యనారాయణ కు కాలేజీ వాళ్లు సమాచారం ఇవ్వగా వాళ్లు వచ్చి పోలీస్ సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా రేస్మిత తాను ఉండే హాస్టల్ గదిలో ఫ్యాన్ కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు.నిన్న రాత్రి గదిలో ఆమె ఒక్కతి మాత్రమే ఉన్నదని,తన మృతికి గల కారణం కనుక్కోగలరు అని మృతురాలి తండ్రి గంటోజు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసు వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎనుమముల ఇన్స్పెక్టర్ ఏ రాఘవేందర్ తెలియజేశారు.అత్మహత్యకు సంబంధించిన పూర్తి వివరాలు కోసం విచారణ చేపట్టి పూర్తి విషయాలు వెల్లడిస్తామని సిఐ తెలిపారు.

## సిబిసి చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



వరంగల్ ప్రతినిధి ఫిబ్రవరి26 మేజర్ న్యూస్ (సూర్య)గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో 3వ డివిజన్ పరిధిలోని పైడిపల్లి గ్రామం లో సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ప్రారంభోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు.అనంతరం చర్చి కమిటి సభ్యులు ఎమ్మెల్యే నాగరాజు ను శాలువాతో సత్కరించి,జ్ఞాపికను అందచేశారు.ఈ కార్యక్రమంలో జన్ను శిభారాణి - అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,దైవ జనులు, దైవ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# శివ నామస్మరణతో మారుమోగిన దేవాలయాలు



శాయంపేట, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ సూర్య : మండలం కేంద్రంలోని శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయం, శ్రీ భూదేవి శ్రీదేవి సహిత వెంకటేశ్వర స్వామి, భక్త మార్కండేయ దేవాలయం తో పాటు మండలంలోని అన్ని రాజరాజేశ్వర స్వామి దేవాలయా లలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారము తెల్లవారుజాము నుండి మహా రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలను భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి దేవాలయంలో అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి ప్రత్యేక పూజలు నిర్వహించినారు. భక్తులు ఉదయం నుండి అభిషేకాలు అర్చనలు నిర్వహించి మహాశివుని తమ కోర్కెలు నెరవేర్చాలని పూజలు చేసారు. పెద్దకొడెపాకలో ప్రత్యేక పూజలు చేసిన మాజీ స్పీకర్ మధుసూదనా చారి మండలంలోని ప్రసిద్ధి చెందిన పెద్ద కొడపాక రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనా చారి ప్రత్యేక పూజలు చేశారు. తన స్పీకర్ గా ఉన్న సమయంలో దేవాలయానికి ప్రత్యేక నిధులు కేటాయించి దేవాలయ అభివృద్ధికి కృషి చేశానని ఈ సందర్భంగా గుర్తు చేశారు.



ఈ పూజా కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి రాజమణి దంపతులు, బాసని మల్లికార్జున్, ప్రకాష్, మామిడి మారుతి, కంబత్తుల ప్రకాష్, వలపదాసు వెంకటరమణ,దిడ్డి ప్రభాకర్, లోకల బోయిన కుమారస్వామి, కొత్తపెల్లి రవీందర్, బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుర్రం రవీందర్,బగ్గి రమేష్, బుర్ర విజయ్, పోడి శెట్టి గణేష్, యువజన నాయకులు బేరుగు రాకేష్, అరకిల విజయ్,పల్ల బోయిన సారయ్య, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి





మొగుళ్లపల్లి ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ (సూర్య) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్సై బి అశోక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో నేడు జరగనున్న ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియకు మండల కేంద్రంలో ని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద అన్ని ఏర్పాట్లతో పాటు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు అయన అన్నారు. శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పారదర్శకంగా. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు. పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశామని. శాసనమండలి పట్టభద్రులు తమ అమూల్యమైన ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సై అశోక్ పట్టభద్రులకు సూచించారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన డి.ఎస్.పి సంపత్ రావు**

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్ జరుగుతున్న నేపథ్యంలో బుధవారం భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల లో గల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్స్ సజావుగా సాగేలా చూడాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చేసుకోకుండా , సమర్థవంతంగా పోలింగ్ జరిగేలా చూడాలని అన్నారు. ఆయన వెంట చిట్యాల సిఐ డి, మల్లేష్, మొగుళ్లపల్లి ఎస్సై బి అశోక్, ఆర్ ఐ సురేందర్ రెడ్డి , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# -వీరభద్రుని దర్శించుకున్న ఎం ఎల్ సి సత్యవతి రాథోడ్.





## -జాతర ఏర్పాట్లపై ఎమ్మెల్సీ పెదవి విరుపు .

కురవి పిబ్రవరి 26,మేజర్ న్యూస్ (సూర్య):కురవి మండల కేంద్రములో మహాశివరాత్రి పర్వాదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి ఎం ఎల్ సి సత్యవతి రాథోడ్ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వారి ఆలయం ను సందర్శించి స్వామి వారిని అమ్మ వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వాహించారు. కురవి మహా జాతర ఏర్పాట్లపై మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ పెదవి విరిచారు. రోజు రోజుకు క్రమంగా భక్తుల రాక పెరుగుతూ పోతుందని అన్నారు .ఇప్పటికైనా అధికారులు అప్రమత్తం కావాలని అన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. అనంతరం దుకాణాల్లో మిటాయి, బూరలు కొని సందడి చేశారు. కార్యక్రమం లో మాజీ జెడ్పి చైర్మన్ అంగోతు బిందు, బి ఆర్ ఎస్ కురవి మండల అధ్యక్షులు తోట లాలయ్య, బి ఆర్ ఎస్ యూత్ నాయకులు గుగులోత్ రవినాయక్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ రాజు నాయక్, బోడ శ్రీనివాస్, బాదె నాగన్న,అయిలి నరహరి గౌడ్.,ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, నెహ్రూ నాయక్, కల్లెపు శ్రీను బాణోత్ వీరన్న రమేష్ బద్రు, జీవన్ కుమ్మరికుంట్ల సత్యనారాయణ, బొమ్మకంటి వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

-కురవి వీరభద్ర స్వామి ని దర్శించుకున్న ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు.

-జాతర నిర్వాహణపై ఎమ్మెల్సీ ఆగ్రహం

-గాలికొదిలేసి చోద్యం చూస్తున్నారంటూ తీవ్ర విమర్శలు





కురవి పిబ్రవరి 26,మేజర్ న్యూస్ (సూర్య):మహాశివరాత్రి సందర్బంగా ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు కురవి వీరభద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహీంచారు. అనంతరం మహాశివరాత్రి సందర్బంగా నిర్వహించు కురవి మహా జాతర నిర్వాహణపై ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కురవి జాతరకు వచ్చిన భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికైనా అప్రమత్తం కాకుంటే, రాత్రి జరిగే కళ్యాణోత్సవం మరింత రసాభాసగా మారే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తాను అనేక సంవత్సరాల నుండి జాతరాకు వస్తున్నానని, భక్తుల ఇంత అసౌకర్యానికి గురవడం, విఐపిల దర్శనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడాన్ని మాత్రం ఇప్పుడే చూస్తున్నానని ఆయన అన్నారు. జాతరను గాలికి వదిలి చోద్యం చూస్తున్నారని తీవ్రవిమర్శలు చేశారు.విషయాన్ని, ప్రభుత్వం దృష్టికి, సంబందిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

**కురవి వీరభద్రుని ఆలయంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్.**

**-డోర్నకల్ బిఆర్ ఎస్ యువనాయకులు డిఎస్ రవిచంద్ర. ప్రత్యేక పూజలు.**



కురవి పిబ్రవరి 26,మేజర్ న్యూస్ (సూర్య):మహాశివరాత్రి సందర్బంగా మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ దంపతులు, డోర్నకల్ యువ నాయకులు డి ఎస్ రవిచంద్ర లు కురవి వీరభద్రుని ఆలయం లో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మహా శివరాత్రి సందర్బంగా భక్తుల ప్రత్యేక పూజలు

**ధన మైసమ్మ ఆశీర్వాదాలు తీసుకున్న కమిటీ అధ్యక్షులు తోట బాబన్న**



వరంగల్ ప్రతినిధి ఫిబ్రవరి26 మేజర్ న్యూస్ (సూర్య)మహా శివరాత్రి సందర్బంగా నగరంలోని శివాలయాల్లో, ప్రముఖ అమ్మవారి ఆలయాల్లో సైతం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్బంగా కొలిచిన భక్తులకు కొంగు బంగారమై నిలుస్తున్న మెట్లబావి శ్రీ ధన మైసమ్మ అమ్మవారు అర్ధనారీశ్వరులైన శ్రీ పార్వతి పరమేశ్వరుల స్వరూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.భక్తులు ఉదయం నుండి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించు కున్నారు.ఈ సందర్బంగా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తోట బాబన్న మాట్లాడుతూ శైవ క్షేత్రాలతో పాటు అమ్మవారి ఆలయలు భక్తులతో కిట కిట లాడాయని ఆనందాన్ని వ్యక్తం చేశారు.వందల ఏళ్ల చరిత్ర కలిగిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుండి భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి పునీతులు అయ్యారని తెలిపారు. మహా శివరాత్రి సందర్బంగా నగర ప్రజలకు భక్తులకు ఆలయ కార్యనిర్వాహన సమితి తరుపున శుభాకాంక్షలు తెలియ జేశారు.

# ఎన్నికల నిర్వహణకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలి

**-జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్**

**- ఎమ్మెల్సీ ఎన్నికలకు 150 మంది పోలీస్ సిబ్బంది**

**-సిబ్బంది, అధికారులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు**




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26,మేజర్ న్యూస్ (సూర్య ):ఉపాధ్యాయ,పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా 150 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని,ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అధికారులు, సిబ్బంది కృషి చేయలని ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు,సిబ్బందికి జిల్లా ఎస్పిసుధీర్ రాంనాధ్ కేకన్ సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన 16 పోలింగ్ కేంద్రాలో 1663 మంది ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలోవినియోగించుకునేల పోలింగ్ పక్రియ మొదలు నుండి పూర్తి అయ్యేవరకు పోలింగ్ కేంద్రాల వద్ద విధులలో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని పోలీస్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా163 బిఎన్ఎస్ ఎస్ ఆక్ట్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, 100 మీటర్ల, 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు ఉంటాయని,ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పి తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ ఎస్ సెక్షన్ అమలులో ఉందని,ఐదుగురు కానీ అంతకంటే ఎక్కువమంది కానీ గుంపులు గుంపులుగా తిరగవద్దని,పార్టీ జెండాలు పార్టీ గుర్తులు ప్లే కార్డ్స్ ధరించవద్దు, ప్రదర్శించ వద్దన్నారు.మైకులు, లౌడ్ స్పీకర్లు వాడరాదు, పాటలు ఉపన్యాసాలు ఇవ్వకూడద న్నారు.మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు పోలింగ్ కేద్రంలలోకి అనుమతి లేదని, ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం లాంటివి నిర్వహించడం నేరంగా పరిగణించడంతో పాటు సదరు వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఓటు హక్కు కలిగిన పట్టభద్రులు, ఉపాద్యాయులు, పోలీసుల సలహాలు సూచనలు పాటించి ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని సూచించారు.

# శివాలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే నాగరాజు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్





హసన్పర్తి, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ (సూర్య).హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల పరిధిలోని సిద్దాపురం గ్రామ కత్తెరశాల మల్లికార్జున స్వామి దేవాలయం లో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు అభిషేక కార్యక్రమం ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ అభిషేకం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే నాగరాజు, అధ్యక్షుడు దిలీప్ రాజుని శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను సందర్శించి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పట్నాల కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్రెడ్డి, ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కిట్స్ వాకర్స్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ



హసన్పర్తి, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ (సూర్య). మహాశివరాత్రి సందర్భంగా కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగమళ్ళ సుధీర్ ఆధ్వర్యంలో బుధవారం ఎర్రగట్టు గుట్ట శివాలయంలో పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వాకర్స్ డిస్ట్రిక్ట్ 303 కేబినెట్ సెక్రటరీ బూర రాంచందర్ హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. కిట్స్ వాకర్స్ అనేక కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. ఇంకా అనేక కార్యక్రమాలు చేయాలనీ కోరారు. డిస్ట్రిక్ట్ 303 వాకర్స్ తరుపున ఏ సహాయం ఐయినా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 303 డిప్యుటీ గవర్నర్ పాపిశెట్టి శ్రీధర్, డిస్టిక్ 303 బి ఓ డి పోలసాని రామచందర్ రావు, కోశాధికారి గూడూరి లక్ష్మినారాయణ, సభ్యులు చకిలం చంద్రశేఖర్, కీర్తి సూరయ్య, జీ. రవికుమార్, ఎమ్. బిక్షపతి, కే. రమేష్, వి. తిరుపతి, వి.లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు.

## కురవి వీరన్న సన్నిధిలో ఖమ్మం ఎం పి పూజలు.



కురవి పిబ్రవరి 26,మేజర్ న్యూస్ (సూర్య):మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి డోర్నకల్ ఎమ్మెల్యే విప్ రాంచందర్ నాయక్ తో కలిసి కురవిలోని శ్రీభద్రకాళిసమేత వీరభద్రస్వామివారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమం లో నూకల అభినవ్ రెడ్డి స్నేహ యూత్ అధ్యక్షులు కాలం రవీందర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ గంధసిరి అంబారీష ,. ఎస్ కె అబ్జల్, మాజీ సర్పంచ్ రాంలాల్ ,మెచ్చు అశోక్ కుమార్ గౌడ్,గుండగని వెంకన్న గౌడ్, బోడ రమేష్ నాయక్ కాంగ్రెస్ పార్టీ యూవ నాయకులు సురేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,బానోతు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### కురవి జాతర బందోబస్త్ ను పరిశీంచిన ఎస్పీ.



కురవి పిబ్రవరి 26,మేజర్ న్యూస్ (సూర్య):మహా శివరాత్రి సందర్బంగా కురవి జాతర బందోబస్తు ఏర్పాట్లను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలుసూచనలు చేశారు.

# నేడు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

### ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
### పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 26(మేజర్ న్యూస్ సూర్య):ఉమ్మడి కరీంనగర్, మెదక్, అదిలాబాద్, నిజామాబాద్ (పట్టభద్రులు, ఉపాధ్యాయ) ఎమ్మెల్సీ స్థానానికి నేడు భీమదేవరపల్లి మండలంలో పోలింగ్ జరగనుంది. పోలింగ్ కు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పోలింగ్ జోనల్ ఆఫీసర్ పద్మ, నోడల్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. భీమదేవరపల్లి మండల పరిధిలో 1375 మంది పట్టభద్రులు,53 మంది టీచర్స్ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. భీమదేవరపల్లి కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు 2 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ పోలింగ్ విధుల్లో 12 మంది పోలింగ్ సిబ్బందితో, ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని జోనల్ ఆఫీసర్ పద్మ తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె సూచించారు.



పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపారు.

# ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు.



### -ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు.
### -ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు.

కురవి పిబ్రవరి 26,మేజర్ న్యూస్ (సూర్య):కురవి జాతరకు వచ్చిన ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్-డాక్టర్ ప్రమీల దంపతులకు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కురవిలోని శ్రీభద్రకాళిసమేత వీరభద్రస్వామివారి ఆలయాన్ని సందర్శించినప్రభుత్వవిప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్-డాక్టర్ ప్రమీల దంపతులు ప్రత్యేక పూజలు నిర్వాహించారు.అనంతరం కురవి జాతరలో మెడికల్ క్యాంపులో సందర్శించి భక్తులకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన వైద్యపరమైన సలహాలు సూచనలు చేశారు.కురవి జాతరలో శ్రీసత్య సాయి సేవాసమితి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన నీటిప్రసాద సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ నాయక్, పి ఏ సి ఎస్ చైర్మన్ గార్లపాటి వెంకట్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొర్ని రవీందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అంబటి వీరభద్రం, మాజీ జెడ్పి టి సి బండివెంకట్రెడ్డి.,ధర్మకర్తలమండలి సభ్యులు,కాలంరవీందర్రెడ్డి,ఎర్రనాగేశ్వర్రావు,సత్యసాయిసేవాసమితి కురవి



కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్ ,బండి శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు శరత్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి స్థలం విషయంలో తలెత్తిన వివాదం...



### మహిళపై కొడవలితో దాడి
### మహిళకు తీవ్ర గాయాలు

కేసముద్రం,ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ (సూర్య): మహబూబాబాద్ జిల్లా, కేసముద్రం మండలం, తౌర్య తండ గ్రామపంచాయతీ పరిధిలోని పడమటి తండ కు చెందిన రాజీ అనే మహిళపై రమేష్ అనే వ్యక్తి కొడవలితో దాడి చేయగా సదరు మహిళలకు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది.పలువురు తండా వాసులు కథనం ప్రకారం.. ఇంటి స్థలం విషయంలో రమేష్ రాజీతో గొడవపడి కొడవలితో విచక్షణ రహితంగా దాడి చేయగా రాజీకి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. తీవ్ర గాయాలైన రాజీని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ విషయమై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

## సామాన్య ప్రజలకు చేరువలో న్యాయ సేవలు







వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి 26, మేజర్ న్యూస్ సూర్య, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శివరాత్రి పర్వదినం సందర్భంగా కాశిబుగ్గ లోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం ముందు ప్రత్యేక స్టాల్ ను ఏర్పాటు చేసి, సందర్శకులకు చట్టపరమైన సమస్యలపై అవగాహన కల్పించారు. స్టాల్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలందరూ వివిధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉద్దేశంతో ఈ స్టాల్ ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, చట్టానికి పేద, ధనిక అనే భేదం ఉండదని ఈ సందర్భంగా తెలియజేశారు. జాతీయ లోక్ అదాలత్ గురించి వివరణ ఇచ్చి, రాజీమార్గం ద్వారా మార్చి 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ లో తమ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. ఎటువంటి న్యాయ సహాయానికైనను జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను ఆశ్రయించి ఉచిత న్యాయ సేవలు, సలహాలు పొందవచ్చునని తెలిపారు ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థలకు సంబంధించిన వివిధ చట్టాల కరపత్రాలను సందర్శకులకు అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యం. సాయి కుమార్, జువైనల్ సభ్యుడు మేరుగు సుభాష్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి పర్వదినాన్ని ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

### పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి హనుమండ్ల ఝూన్సీ రాజేందర్ రెడ్డి

పాలకుర్తి ఫిబ్రవరి 26 మేజర్ న్యూస్ (సూర్య)మహాశివరాత్రి పర్వదినాన్ని శివ భక్తులు అత్యంత పవిత్రమైన దినంగా జరుపుకోవాలని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి హనుమండ్ల ఝూన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం పాలకుర్తి మండలంలోని లక్ష్మీ సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఝూన్సీ రెడ్డి మాట్లాడుతూ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు తెలపడం జరిగిందని చెప్పారు. ఈ రోజు ముఖ్యంగా ప్రజలు భక్తి ఆధ్యాత్మికతను పెంచుకునే రోజు కాబట్టి, అందరూ భక్తిశ్రద్ధలతో ఉండాలని, స్వామి దయతో ఆత్మ శాంతిని పొందాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పాలకుర్తి నియోజకవర్గ ప్రజ లు



ఆయురారోగ్యాలతో, సకల సౌభాగ్యాలతో, విలసిలాలని ఆమె స్వామి వారిని వేడుకున్నారు.

## ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### - ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్

మరిపెడ,ఫిబ్రవరి 26,మేజర్ న్యూస్(సూర్య):ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకొని నాణ్యమైన పరువులు,విత్తనాలు పొందాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ రైతులకు సూచించారు. బుధవారం ఆయన మరిపెడ మండలం తానంచర్ల గ్రామంలో ప్రో.తేజావత్ భరత్ కుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ మాట్లాడుతూ రైతుల కోసమే అగ్రోస్ సేవా కేంద్రం పని చేయాలని అన్నారు. రైతులకు అందుబాటులో ఉండే విధంగా అగ్రోస్ రైతు సేవా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు విక్రయించాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డోర్నకల్ నియోజకవర్గ యువ నాయకులు నూకల అభివన్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ నాయకులు ఒంటికొమ్ము యుగేందర్రెడ్డి,మండల అధ్యక్షులు పెండ్లి రఘు వీర్రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్,మాజీ సర్పంచ్ పానుగోత్ రాంలాల్,మాజీ ఎంపిటీసీ గంధసిరి అంబరిష, నాయకులు పురుషోత్తంరెడ్డి, పాశం నరేష్ రెడ్డి,అశోక్



కుమార్,నల్లు శ్రీకాంత్ రెడ్డి, రావుల వెంకట్రెడ్డి, కందిబండ ప్రసాద్,గుగులోత్ రమేష్ నాయక్,మాజీ సర్పంచ్ తేజావత్ జగిని లాలు నాయక్,తేజావత్ ప్రవీణ్ నాయక్,భూక్య వెంకన్న,వాంకుడోతు రవినాయక్,పాశం సుధాకర్రెడ్డి,మాలోత్ ధన్ సింగ్,సీత వీరభద్రం ఫెర్టిలైజర్ అసోసియేషన్ మండల అధ్యక్షులు కాలం శ్రీనివాస్ రెడ్డి,గోపాల్ రెడ్డి, రామకోటి,మాలోతు ధన్ సింగ్,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో గున్నేపల్లిలో ఇల్లు దగ్ధం





### - సుమారు 5 లక్షల నష్టం బాధితురాలు వెల్లడి. భాషపాక వెంకటమ్మను ఆదుకోవాలని కోరుతున్న గున్నేపల్లి గ్రామస్తులు

దంతాలపల్లి, ఫిబ్రవరి 26 ( సూర్య న్యూస్ ):దంతాలపల్లి మండలం గున్నేపల్లి




గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఓ ఇల్లు దగ్ధమైంది.భాషపాక వెంకటమ్మ భర్త నర్సయ్య ఇల్లు దగ్ధమైన బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం బుదవారం ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో పనులు ముగించుకుని పని నిమిత్తం బయటకి వెళ్ళగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు కాలిపోతుండగా గ్రామస్తులు గమనించి నీటితో మంటలను చల్లార్చారని,సుమారుగా రు 5 లక్షల నష్టం వాటిల్లిందని,లక్ష యాభై వేల రూపాయలు ఇంటి నిర్మాణం కోసం అప్పుగా తీసుకొచ్చానని,తులం బంగారం,30 తులాల వెండి,భూమి పట్టా బుక్కులు,బ్యాంకు బుక్కు,చిన్న పిల్లలు చదువుకున్న సర్టిఫికెట్లు, ఎల్ఐసి కాగితాలు అన్ని కాలిపోయాయని,బోరున విలపించింది,ప్రభుత్వం తనను అదుకుని ఆర్థిక సాయం అందించాలని కోరింది.కూలి పనులకు వెళ్లి జీవనం కొనసాగిస్తున్న భాషపాక వెంకటమ్మను ప్రభుత్వం అదుకోవాలని గ్రామస్తులు సైతం కోరారు.

# పాలకుర్తి సోమేశ్వర ఆలయం లో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
















## భక్తులతో కిటకిటలాడిన ఆలయం

## కన్నుల పండువగా శివపార్వతుల కళ్యాణం

పాలకుర్తి ఫిబ్రవరి 26(మేజర్ న్యూస్ సూర్య):పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహ స్వామి వార్ల దేవస్థానం లో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. శివరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం తెల్లవారుజాము నుంచే సోమేశ్వర ఆలయానికి శివాలయం కు భక్తులు బారులు తీరారు. ఉదయం ఆలయం లో స్వామి వారికీ అర్చకులు మహన్యాస రుద్ర పూర్వక వేదమంత్రాల నడుమ అభిషేకాలను నిర్వహించారు. ఉదయం నుంచె భక్తులు శివనామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సాయంకాలం శ్రీ సోమేశ్వరలక్ష్మి నరసింహ స్వామి వార్ల కల్యాణ మహెూత్సవం కన్నుల పండుగ గా జరిగిందిజనగామ అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్ ల దంపతులు స్వామి వారికీ పట్టు వస్త్రాలు సమర్పించారు.జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని,స్టేషన్ ఘనపూర్ ఆర్. డి.ఓ డి యస్ వెంకన్న,జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ మహేందర్ రెడ్డి,ఎస్ ఐ పవన్ కుమార్ ల ఆధ్వర్యంలో పటిష్ట భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు.పాలకుర్తి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ ఐ రాకేష్ ల ఆధ్వర్యంలో కల్యాణ మండపం వద్ద ఎలాంటి అవంచానియా సమస్యలు లేకుండా చేశారు.పాలకుర్తి ఎంపీడీఓ రాములు ఆధ్వర్యంలో జాతర లో ఎలాంటి పరిశుద్ధ లోపం లేకుండా పంచాయతి రాజ్ సిబ్బంది పనిచేశారు.

**ప్రత్యేక పూజలు నిర్వహించిన హనుమాండ్ల. ఝాన్సీ రెడ్డి**

పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రముఖ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన స్వయంభు శ్రీ చండికా సమేత సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగాపాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి ప్రత్యేక పూజలు అభిషేకాల నిర్వహించారు.అదేవిదంగా హనుమండ్ల ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది.వారి వెంట తొర్రుర్ మార్కెట్ చైర్మన్ హనుమండ్ల తిరుపతి రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, మార్కెట్ చైర్మన్ లావుడ్య మంజుల, బైరు భార్గవ్ తదితరులు ఉన్నారు.

**మహాశివరాత్రి పర్వదినాన ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి**

పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రముఖ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన కోరిన కోరికలు తీర్చే స్వయంభు శ్రీ చండికా సమేత సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.వారి వెంట మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ జడ్పీటీసీ పూస్కూరి శ్రీనివాస్ రావు, మాచర్ల ఎల్లయ్య, కారుపోతుల వేణు తదితరులు ఉన్నారు.